

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శని) సా.6.22
సహరీ (ఆది) ఉ.4.49

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
అమలాపురం	33	26

హడావిడి

- అమలాపురం, పి.గన్నవరం అభ్యర్థులపై అభిప్రాయ సేకరణ
- ఐవీఆర్ఎస్ ద్వారా సర్వే చేపట్టిన టీడీపీ, జనసేన
- అమలాపురం అసెంబ్లీ సీటును రాజబాబుకే కేటాయించాలంటూ రోడ్డెక్కిన జన సైనికులు
- ఇంకా తేలని అమలాపురం లోక్‌సభ అభ్యర్థి
- నేడు షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో హడావిడిగా వైసీపీ నేతల కార్యక్రమాలు

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ శనివారం వెల్లడి కానున్న నేపథ్యంలో కోనసీమ జిల్లాలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. పెండింగులో ఉంచిన రెండు స్థానాల్లో అభ్యర్థుల ఎంపికపై టీడీపీ, జనసేన అధిష్ఠానాలు దృష్టి సారించాయి. మరోవైపు వైసీపీ తరపున పోటీ చేసే అభ్యర్థులను శనివారం అధికారికంగా ప్రకటించనున్నారు. కోడ్ అమల్లోకి రానున్న నేపథ్యంలో హడావిడిగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడంలో అధికార వైసీపీ నేతలు బిజిబిజీగా ఉన్నారు. కొందరు ఆశా వహులు టిక్కెట్లకై అధిష్ఠానాల ఆశీస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. మరి కొందరు తమ పార్టీ అభ్యర్థికే టిక్కెట్టు కేటాయించాలంటూ రోడ్డెక్కి ఆందోళనకు దిగుతున్నారు.

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి రెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ఇందులో భాగంగా టీడీపీ, జనసేన పార్టీలు శుక్రవారం అభ్యర్థుల పేర్లతో ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా అభిప్రాయ సేకరణ చేపట్టాయి. అమలాపురం అసెంబ్లీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా అయితాబత్తుల ఆనందరావు పేరుతో ఉదయం, మాజీ ఎంపీ బుచ్చిమహేశ్వరరావు తనయురాలు డాక్టర్ సత్యశ్రీ పేరుతో మధ్యాహ్నం ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. పి.గన్నవరం స్థానానికి జనసేన అభ్యర్థిగా పోలీసు శాఖలో పనిచేసిన గిడ్డి సత్యనారాయణ పేరుతో ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో అమలాపురం సీటును టీడీపీకే కేటాయిస్తున్నారంటూ పట్టణంలో జోరుగా ప్రచారం సాగడంతో జనసేన శ్రేణులు గడియార స్తంభం సెంటర్లో ఆందోళనకు దిగారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అమలాపురం అసెంబ్లీ టిక్కెట్టును శెట్టిబత్తుల రాజబాబుకే కేటాయించాలని డిమాండు చేశారు. జనసేన అధిష్ఠానం త్వరగా ప్రకటన చేయకపోతే తామంతా నిరవధిక ఆందోళనకు సిద్ధం కావాల్సి వస్తుందని రాజబాబు వర్గానికి చెందిన సూదా చిన్నా, పిండి రాజా, ఆకుల బుజ్జి, మహాదశ నాగేశ్వరరావు హెచ్చరించారు. పోలీసులు ఆందోళన విరమించాలని కోరడంతో జనసేన నేతలు అక్కడి నుంచి నిష్క్రమించారు. అయితే ఇప్పుడు అమలాపురం సీటు టీడీపీకి కేటాయిస్తారా లేక ఇంకా జనసేనకు కేటాయించే అవకాశాలు ఉన్నాయా అనేది పి.గన్నవరం అభ్యర్థి ఎంపికను బట్టి ఆధారపడి ఉంటుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఒకవేళ గన్నవరం స్థానాన్ని జనసేనకు కేటాయిస్తే అమలాపురం నుంచి టీడీపీ పోటీ చేస్తుందని ప్రజలు భావిస్తున్నారు.

ఇదిలా ఉండగా అమలాపురం లోక్‌సభ స్థానానికి అభ్యర్థిని టీడీపీ అధిష్ఠానం ఖరారు చేయాల్సి ఉంది. గంటి హరీష్‌మాధుర్ పేరును ప్రకటించడంలో అధిష్ఠానం చేస్తున్న జాప్యంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. హరీష్‌తో పాటు డాక్టర్


అమలాపురం గడియార స్తంభం సెంటర్లో ధర్నా చేస్తున్న జనసేన ఇన్‌చార్జి రాజబాబు వర్గీయులు

సత్యశ్రీ, పారిశ్రామికవేత్త వై.రమేష్‌బాబు పేర్లు కూడా అధినాయకత్వం పరిశీలనలో ఉన్నాయని ఆ పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

ఇదిలా ఉండగా శనివారం మధ్యాహ్నం 3 గంటలకు కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ వెలువరించనున్న నేపథ్యంలో అధికార వైసీపీ నేతలు హడావిడిగా కార్యక్రమాలు ముగిస్తున్నారు. షెడ్యూల్ ప్రకటించిన సమయం నుంచే ఎన్నికల నియమావళి అమలులోకి రానుంది. దీంతో రెండు రోజులుగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడంతో పాటు ఇళ్ల పట్టాలు, ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. ఎన్నికల విధులకు వలంటీర్లను దూరంగా ఉంచాలన్న నేపథ్యంలో జిల్లాలోని వైసీపీ నేతలంతా ఆయా నియోజకవర్గాల్లో వలంటీర్లతో సమావేశాలు నిర్వహించి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై సూచనలిస్తున్నారు. మండపేటలో ఇళ్ల పట్టాల పంపిణీ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో జరిగింది. అధికారిక ఉత్తర్వులు లేకుండా మార్కెట్ కమిటీ చైర్మన్‌కు అక్కడ బాధ్యతలు అప్పగించారు. ఇలా ఎక్కడపడితే అక్కడ అధికార వైసీపీ నేతలు హంగు, ఆర్భాటాలతో కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.

రబీ ధాన్యం కొనుగోలుకు
సన్నద్ధం కావాలి

- జిల్లాలో 7,58,908 మెట్రిక్ టన్నుల దిగుబడి: జేసీ నుపూర్‌అజయ్



అమలాపురం టౌన్, మార్చి 15: ప్రస్తుత రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం కావాలని జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ కొనుగోలు కమిటీ సభ్యులకు సూచించారు. రబీ ధాన్యం కొనుగోళ్లపై జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జేసీ అధ్యక్షతన శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్‌లో రామచంద్రపురం ప్రాంతంలో వరి కోతలు ప్రారంభమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ముందుగా రామచంద్రపురం ఆర్బీకేల పరిధిలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించాలన్నారు. జీపీఎస్ సహా వాహనాలు, గోనె సంచులను అందుబాటులో ఉంచి తేమ శాతం కొలిచే పరికరాలను, వేయింగ్ మెషీన్లను ఆర్బీకేల వారీగా సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత రబీ సీజన్లో జిల్లాలో 7,58,908 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. అవసరం మేరకు గోనెసంచులను సమకూర్చుకోవాలన్నారు. సిబ్బందికి ముందుగా శిక్షణ ఇవ్వాలన్నారు. సమావేశంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు డి.పుల్లారావు, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎ.పాపారావు, జిల్లా రవాణాధికారి అశోక్ ప్రతాప్‌రావు, కార్మిక శాఖ సహాయ కమిషనరు టి.నాగలక్ష్మి, తూనికలు, కొలతల శాఖ కంట్రోలర్ కె.రాజేష్, జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, జిల్లా సహకార అధికారి రాధాకృష్ణారావు పాల్గొన్నారు.

పంట కాల్వల మూసివేత సమయంలో...
పూడికతీత పనులు ప్రారంభించాలి

అమలాపురం టౌన్, మార్చి 15: జిల్లాలో పంట కాల్వలను మూసివేసే సమయంలో పూడికతీత పనులు ప్రారంభించేలా ముందుగా ప్రతిపాదనలు మంజూరు చేయించుకుని సన్నద్ధం కావాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి కమిటీ తీర్మానించినట్టు జేసీ నుపూర్‌అజయ్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఆమె అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. గత తీర్మానాలపై తీసుకున్న చర్యలను జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు సభ్యులకు వివరించారు. రైతుల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకకు కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలని జేసీ కోరారు. రబీ సాగు ఆరంభంలో సాగునీటికి ఇబ్బంది వచ్చే అవకాశాలు ఉన్నాయని భావించినప్పటికీ గోదావరి పరివాహక ప్రాంతం, పోలవరం ప్రాజెక్టు వద్ద నీటి నిల్వలు సమృద్ధిగా ఉండడం, వాతావరణం అనుకూలించడం వల్ల దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని రైతు కమిటీ కార్యదర్శి కొవ్వూరి త్రినాథ్‌రెడ్డి పేర్కొన్నారు. రబీ పంట చివరి దశలో ఉన్న సమయంలో పిల్లిపెసర, జనుము, జీలుగు వంటి పంటలు వేసుకునే విధంగా ఆర్బీకేల ద్వారా విత్తనాలు సరఫరా చేయాలని కోరారు. రబీ సీజను ముగిసిన తర్వాత సాగు క్షేత్రాల్లో ఉన్న వరి గడ్డిని స్ట్రా బ్యానర్ పద్ధతిలో సేకరించి పశువులకు వినియోగించుకోవాలని జేసీ కోరారు. ధాన్యం సేకరణకు సంబంధించి ఆయా ప్రాంతాల్లోని మిల్లుల వద్దకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో రవాణా భారం పెరుగుతుందని కమిటీ సభ్యులు సూచించగా జేసీ సమ్మతించారు. రాష్ట్ర అగ్రిమిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు, వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు రమేష్, వై.వెంకటేష్, వ్యవసాయ శాఖ ఏడీ ఎంఎ షంషీ, డ్రైనేజీ డీఈ ఎంవీ కిశోర్, జలవనరుల శాఖ డీఈ శ్రీనివాసరావు, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, పశుసంవర్థక శాఖ జిల్లా అధికారి వెంకట్రావు పాల్గొన్నారు.


తాటికాయలవారిపాలెం ప్రధాన రహదారిపై నిరసన తెలుపుతున్న మహిళలు

తాగునీరు మహాప్రభో!

- ఐదేళ్లుగా అవస్థలు పడుతున్నా అధికారులు పట్టించుకోవట్లేదు
- ఖాళీ బిందెలతో రెండు గంటల పాటు రహదారిపై మహిళల నిరసన
- అధికారుల హామీతో విరమణ


మహిళలతో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు

పి.గన్నవరం, మార్చి 15: తాగునీటి కోసం ఐదేళ్లుగా నానా అవస్థలు పడుతున్నాం... మా గ్రామంలో కనీసం పైపులైను కూడా వేయలేదు.. అంటూ పి.గన్నవరం శివారు తాటికాయలవారిపాలెం మహిళలు శుక్రవారం రాజవరం-పొదలాడ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఇంటింటికీ కుళాయి అని ఊదరగొడుతున్న ప్రభుత్వం మాకు మాత్రం ఇప్పటివరకు పైపులైను ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. పైపులైన్ కనెక్షన్ తొలగించడంతో వచ్చే ఆ కాస్త నీరు రెండేళ్లుగా రాకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాటికాయలవారిపాలెంతో పాటు కొక్కిరివారిపేట, చింతపల్లివారిపేట గ్రామాలకు సైతం తాగునీరు అందట్లేదన్నారు. నీటికోసం రాయపాడు చెరువు వద్దకు వెళ్తున్నామన్నారు. అక్కడ కూడా నీరు లేకపోతే పంచాయతీ వద్ద వాటర్ ట్యాంకు సమీపంలోకి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంకును ఇప్పటివరకు ప్రారంభించలేదన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించకపోతే ఎన్నికలను బహిష్కరిస్తామని మహిళలు హెచ్చరించారు. అటుగా వెళ్తున్న బీఎస్పీ నాయకులు, టీడీపీ నాయకుడు పెద్దిరాజు ఆగి మహిళలతో మాట్లాడారు. సమస్య నాలుగు రోజుల్లో పరిష్కారం కాకపోతే మీతో పాటు మేము కూడా పోరాడతామని హామీ ఇవ్వడంతో మహిళలు నిరసన విరమించారు. ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ పద్మనాభం, జేఈ జె.కళ్యాణచక్రవర్తి మాట్లాడుతూ పైపులైను ఏర్పాటు కాస్త అలస్యమైందన్నారు. యుద్ధప్రాతిపదికన పైపులైను ఏర్పాటు చేసి కొత్త వాటర్ ట్యాంక్ ద్వారా తాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. దీంతో మహిళలు శాంతించారు. సుమారు రెండు గంటల పాటు సాగిన నిరసనతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి.

సొంతూరే పొరుగూరు!


గోకనవిల్లిలోని కోదండ రామాలయం

- ఊరికి దూరంగా గోకనవిల్లి
- ప్రధాన గ్రామానికి రావాలంటే మరో మండలం దాటాల్సిందే
- సమస్యకు కారణం 'దసరా బుల్లోడే'
- అపరిష్కృతంగా వారధి సమస్య
- పరిష్కారం కోసం సర్పంచ్ ప్రయత్నాలు


విలసవిల్లి పంచాయతీ కార్యాలయం

స్వగ్రామంలోనే పరాయివారిగా జీవించడం అంటే తెలుసా? ఒకే పంచాయతీలోని ప్రజలు ప్రధాన గ్రామానికి రావాలంటే మరో మండలం మీదుగా ఏడు కిలో మీటర్లు ప్రయాణించడం అంటే విచిత్రంగా అన్పించట్లేదా? మండలంలోని విలసవిల్లి పంచాయతీ గోకనవిల్లి వాసులకు దశాబ్దాలుగా ఇదే పరిస్థితి. ఇది అపరిష్కృత సమస్యేమీ కాదు. అయినా పాలకులు ఆ దిశగా ఆలోచన చేయకపోవడమే వారికి శాపంగా మారింది.

ఉప్పలగుప్తం, మార్చి 15:

విలసవిల్లి ఒక మైనర్ పంచాయతీ. జనాభా ఐదు వేలకు లోపే ఉంటుంది. ఇందులో 500 మంది మాత్రం ప్రధాన గ్రామానికి దూరంగా ఉంటున్నారు. ఆ ప్రాంతమే గోకనవిల్లి. ఇది అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లిని ఆనుకుని ఉంటుంది. ఇక్కడి ప్రజలు తమ అవసరాలకు ప్రధాన గ్రామానికి రావాలంటే ముమ్మిడివరం మండలం అనాతవరం మీదుగా ఏడు కిలోమీటర్లు ప్రయాణించాల్సిందే. లేదా భట్నవిల్లి మీదుగా అనాతవరం దాటి రావాలి. గోకనవిల్లికి విలసవిల్లి దూరం కావడానికి కారణం దసరా బుల్లోడు మీడియం డ్రెయిన్. ఈ డ్రెయిన్‌పై వంతెన నిర్మిస్తే ఈ రెండు ప్రాంతాల మధ్య దూరం 0.750 కి.మీ.కు తగ్గిపోతుంది. డ్రెయిన్‌పై వంతెన నిర్మాణానికి గతంలో శంకుస్థాపన కూడా జరిగింది. నిర్మాణం మాత్రం మొదలుకాలేదు. డ్రెయిన్ నుంచి విలసవిల్లికి రహదారి ఏర్పాటుకు స్థల సేకరణ కూడా అవసరం లేదు. ఆవసరమైన మేరకు ప్రభుత్వ భూమి ఉంది. ఇన్ని అవకాశాలున్నా ఈ వంతెన ఎన్నికల హామీగానే మిగిలింది. అయితే ప్రస్తుత సర్పంచ్ సలాది ఊర్మిళాదేవీసతీష్ డ్రెయిన్‌పై వంతెన నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే వంతెన నిర్మాణానికి అవసరమైన స్థల సర్వే జరిగింది. రహదారి సహా వంతెన నిర్మాణ ప్రదేశంపై ప్రత్యేక మ్యాప్ సిద్ధం చేశారు. గతంలో వంతెన శంకుస్థాపనకు భూమి పూజ చేసిన ప్రస్తుత సర్పంచ్ భర్త సతీష్ తన హయాంలోనే వంతెన నిర్మించి, గోకనవిల్లిని ప్రధాన గ్రామానికి అనుసంధానం చేసేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.


వంతెన నిర్మించాల్సిన దసరా బుల్లోడు మీడియం డ్రెయిన్,


సిద్ధం చేసిన మ్యాప్

త్వరలో వంతెన పూర్తవుతుందని నమ్ముతున్నాం

సలాది ఊర్మిళాదేవీసతీష్, సర్పంచ్



గోకనవిల్లి ప్రజల కష్టాలు తొలగించే ప్రయత్నం జరుగుతోంది. దసరాబుల్లోడు డ్రెయిన్‌పై వంతెన నిర్మిస్తే విలసవిల్లి, గోకనవిల్లి ఒకే ప్రాంతంగా ఏర్పడి అందరికీ ఆనందం కలుగుతుంది. పంచాయతీకి వెళ్లడానికి గోకనవిల్లి వాసులు పడుతున్న ప్రయాణ ఇబ్బందులను చూస్తే ఎవరికైనా అయ్యో పాపం అన్పించకమానదు. డ్రెయిన్‌పై వంతెన నిర్మాణానికి అవసరమైన ప్రాథమిక వసతులను సమకూర్చేందుకు పంచాయతీ సిద్ధంగా ఉంది. వంతెన నిర్మాణానికి ఇప్పటికే రూట్ మ్యాప్ సిద్ధమయ్యింది. మంత్రి విశ్వరూప్ సహకారంతో వంతెన ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపించాం. నిర్మాణానికి అందరి సహకారంతో మా వంతు ప్రయత్నం చేస్తున్నాం.

దశాబ్దాల సమస్యను పరిష్కరించండి

ముషిణి లింగేశ్వరరావు, గోకనవిల్లి



సొంతూర్లోనే పరాయివారుగా కాలం గడుపుతున్నాం. ప్రధాన గ్రామానికి వెళ్లాలంటే ఒక రోజు పనికి సెలవు పెట్టాల్సిందే. కేవలం ఒక డ్రెయిన్ కారణంగా మా పరిస్థితి ఇలా అయ్యింది. డ్రెయిన్‌పై వంతెన నిర్మిస్తే ఊరికి దగ్గరవుతామని పాలకులకు మొరపెట్టుకుంటూ వస్తున్నాం. ప్రభుత్వాలు మారుతున్నాయే గానీ మా సమస్యకు పరిష్కారం దొరకడంలేదు. వంతెన నిర్మించి సమస్యను పరిష్కరిస్తారని ఆశిస్తున్నాం.


సామంతకుర్రు పరిధిలో లింక్ డ్రెయిన్‌లో పనులు చేస్తున్న డ్రెడ్జర్

అడుగడుగునా అవాంతరాలు

- లింక్ డ్రెయిన్ డ్రెడ్జింగ్ పనుల్లో జాప్యం

అల్లవరం, మార్చి 15: ముంపు నుంచి రైతుల భూములను కాపాడాలనే లక్ష్యంతో డ్రైనేజీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన లింక్ డ్రెయిన్ డ్రెడ్జింగ్ పనుల్లో జాప్యం జరుగుతోంది. డ్రెడ్జర్ తరచూ సాంకేతికలోపానికి గురికావడంతో అడుగడుగునా అవంతరాలు ఎదురవుతున్నాయి. అల్లవరం మండలం సామంతకుర్రు-పల్లిపాలెం పరిధిలో డ్రెడ్జింగ్ పనులను డిసెంబరులో మంత్రి పినిపే విశ్వరూప్, కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రారంభించారు. ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధులు రూ.84 లక్షలతో ఒక కిలోమీటరు పొడవునా లింక్ డ్రెయిన్‌లో డ్రెడ్జింగ్ నిర్వహించాల్సి ఉంది. 17 కిలోమీటర్ల లోయర్ కౌశికతో పాటు జీరో కిలోమీటరు నుంచి రామేశ్వరం సాంప్ వరకు డ్రెడ్జింగ్ పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. డ్రెడ్జర్‌కు ఆదిలోనే సాంకేతిక సమస్య తలెత్తింది. జనవరిలో మరోసారి మరమ్మతులకు గురికాగా చెన్నయ్ నుంచి పరికరాలను తీసుకువచ్చి పనులను ప్రారంభించారు. 42వేల క్యూబిక్‌మీటర్ల బురద మట్టిని డ్రెడ్జర్ ద్వారా తీసి లోయర్ కౌశిక డ్రెయిన్ పక్కన ఉన్న భూముల్లోకి వదులుతున్నారు. ఈ లింక్ డ్రెయిన్‌లో వివిధ డ్రెయిన్ల ముంపు ముడిపడి ఉండటంతో డ్రైనేజీ శాఖ పనులను చేపట్టింది. నాలుగు నెలలు కావస్తున్నా పని పూర్తి కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొందరు ఆక్వా రైతులు చెరువుల నుంచి డ్రెయిన్‌లోకి తోడేస్తున్న సజ్జు లింక్ డ్రెయిన్‌లోకి చేరితే ప్రయోజనం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. డ్రైనేజీ శాఖ డీఈఈ ఎంవీవీ కిషోర్, ఏఈ కె.సునీత డ్రెడ్జింగ్ పనులను పరిశీలించారు. 700 మీటర్ల పొడవున లింక్ డ్రెయిన్‌లో 70 శాతం పనులు పూర్తయ్యాయని మరో 300 మీటర్లు డ్రెడ్జింగ్ చేయాల్సి ఉందని డీఈఈ తెలిపారు. రామేశ్వరం వంతెన దగ్గర్లో పనులు చేయాలన్నారు. దేశికోడు డ్రెయిన్‌లో రూ.40 లక్షలతో సైఫన్ నిర్మాణం పూర్తయిందని ఏఈ సునీత తెలిపారు. లింక్ డ్రెయిన్‌లో డ్రెడ్జింగ్ పూర్తి అయితే రామేశ్వరం మొగ ద్వారా 30 వేల ఎకరాల ఆయకట్టు ముంపు నీరు దిగడానికి మార్గం సుమగమవుతుందని డ్రెయినేజీ శాఖ అధికారులు అభిప్రాయపడ్డారు.


డ్రెడ్జింగ్ పైపుల ద్వారా బురద మట్టిని బయటకు తోడుతున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న ఆలయంలో నేడు, రేపు స్వర్ణ శిఖర ప్రతిష్ఠా మహోత్సవాలు

...7లో





పవిత్ర రంజాన్ మాసంలో మొదటి శుక్రవారం ముస్లింలు భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. అమలాపురం మొల్లాముస్తఫా మసీదు, మామిడికుదురులోని జామియా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. (పై చిత్రాల్లో). ఉదయం నుంచి కఠోర ఉపవాస దీక్ష ఉండి సాయంత్రం ఇఫ్తార్ విందు స్వీకరించారు.... వార్తలు 8లో



వాడపల్లి వెంకన్న ఆలయంలో ప్రతిష్ఠించనున్న శిఖరాలు

వాడపల్లి వెంకన్న ఆలయంలో నేడు, రేపు
స్వర్ణ శిఖర ప్రతిష్ఠా మహోత్సవాలు

ఆత్రేయపురం, మార్చి15: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వర్ణ శిఖర ప్రతిష్ఠను ఖండవల్లి వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు శని, ఆదివారాల్లో ఘనంగా నిర్వ హించనున్నారు. వేంకటేశ్వరస్వామి, క్షేత్ర పాలకుడు గోపాలస్వామి, మహాలక్ష్మి అమ్మవారు, అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయాలకు స్వర్ణ శిఖరాలను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సహకారంతో దాతల విరాళాలు రూ.35 లక్షలతో చేయించారు. మహోత్సవానికి ఏర్పాట్లుచేసినట్టు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

దేవదానం రాజుకు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం



యానాం, మార్చి15: కవి, కథకుడు, బహుగ్రంథకర్త దాట్లదేవదానం రాజుకు సృజనాత్మక సాహిత్యం విభాగంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారాన్ని ప్రకటించింది. తెలుగు విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ టి.కిషన్‌రావు ఈ మేరకు ప్రకటన జారీచేశారు. ఈనెల 20వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు హైదరాబాదు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జరిగే సభలో దేవదానం రాజు ఈ పురస్కారాన్ని స్వీకరిస్తారు. కథలు, కవితలు, చరిత్ర, విమర్శ మొదలైన సాహిత్య ప్రక్రియల్లో చేసిన సాహిత్య కృషిని పరిగణలోకి తీసుకుని ఇస్తున్న పురస్కారం గర్వకారణంగా ఉందని, అదీ సప్తతి పుట్టినరోజున ప్రతిష్ఠాత్మకమైన తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారాన్ని స్వీకరించడం మరింత సంతోషంగా ఉందని దాట్ల అన్నారు. ఏడు కవితా సంపుటాలు, ఐదు కథా సంపుటాలు, రెండు దీర్ఘకవితలు, చరిత్ర గ్రంథం, నవల, రాజకీయ వ్యంగ్య కథన చమత్కారాలు వంటి పుస్తకాలను వెలువరించడం జరిగిందన్నారు. ఫ్రెంచ్, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ, ఇంగ్లీషు భాషల్లోకి అనేక కథలు, కవితలు అనువాదం అయ్యాయన్నారు. కాగా దేవదానంరాజు గతంలో కళైమామణి, తెలుగురత్న, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, మధుశ్రీ, కథ గౌరవం, డాక్టర్ పరుచూరి పురస్కారం, కుందుర్తి శతజయంతి ఫ్రీవర్స్ ఫ్రంట్ పురస్కారం వంటివి అందుకున్నారు. ఇప్పుడు కీర్తి పురస్కారానికి ఎంపికైన దేవదానంరాజుకు ప్రముఖ కవులు, సాహితీవేత్తలు కళైమామణి విష్ణుమూర్తి, శిఖామణి, పీఆర్‌ఎల్ స్వామి, మధునాపంతుల సత్యనారాయణమూర్తి, ముమ్మిడి నాగప్రసాద్, చింతా కొండలరావు, జిమ్మి, రామ్మోహనరావు, డాక్టర్ శివప్రసాద్ తదితరులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



మొసలపల్లి వద్ద లారీ బోల్తాపడిన దృశ్యం

రొయ్యలమేత లోడు లారీ బోల్తా

అంబాజీపేట, మార్చి 15: రొయ్యల లోడుతో వెళ్తున్న వ్యాన్ అదుపు తప్పి మొసలపల్లి ప్రధాన రహదారిలో బోల్తాపడింది. కొవ్వూరు నుంచి అమలాపురం వైపు రొయ్యల మేతతో వెళ్తున్న వ్యాను ముక్కామల- ఈదరపల్లి రోడ్డులో మొసలపల్లి దగ్గరకు వచ్చేసరికి అదుపుతప్పి పక్కనున్న గోతులో బోల్తాపడింది. అయితే వ్యానులో ప్రయాణిస్తున్న డ్రైవర్‌తోపాటు మరొకరు సురక్షితంగా బయటపడ్డారు. నిత్యం రద్దీగా ఉంటే ఈ ప్రాంతంలో ప్రమాదం జరిగిన సమయంలో ఎవ్వరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. దీనిపై ఏ విధమైన కేసు నమోదు కాలేదు.



తాడేపల్లిలో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన కాపు నాయకుడు ముద్రగడ పద్మనాభం, ఆయన తనయుడు గిరి



హుకుంపేటలో జరిగిన జయహో బీసీ సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, గోరంట్ల తదితరులు

99 శాతం పనులు పూర్తి చేశావా ?

- ఏదీ.. ఎక్కడ.. సిగ్గు లేదూ..
- కడప పులివి కాదు.. పిల్లివి
- జయహో బీసీ సభలో జగన్‌పై మండిపడ్డ మాజీ మంత్రి అయ్యన్న, ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరంసిటీ/రూరల్/కడియం మార్చి15: ఏటి? రాష్ట్రంలో 99 శాతం పనులు పూర్తి చేశావా? ఏది ఎక్కడా కనబడుట లేదు. సిగ్గులేదా జగన్ నీకు ఆ మాట అనడానికి.. నువ్వు దగా కోరువి. నువ్వు కడప పులివి కాదు.. పిల్లివి.. అందుకే నీవంటే గౌరవం లేదు అని మాజీ మంత్రి టీడీపీ సీనియర్ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు మండిపడ్డారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట గ్రామం జాతీయ రహదారి పక్కన మైదానంలో శుక్రవారం రాత్రి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆధ్వర్యంలో జరిగిన జయహో బీసీ సభలో ఆయన మాట్లాడారు. నాపై 16 కేసులు పెట్టావు? నువ్వు చేసిన తప్పులను ప్రశ్నించినందుకు సీఐడీ ప్రయోగించావు. ఏం పీకారు అన్నారు. అసలు రాష్ట్రానికి ఏమి చేశావు జగన్ ? ఓ పోలవరం చేశావా? ప్రత్యేకహోదా తెచ్చావా? పరిశ్రమలు తెచ్చావా? నిరుద్యోగ సమస్య తీర్చావా? ఏమి చేశావని నీకు ఓటెయ్యాలో చెప్పు అన్నారు. ఏదీ ఇప్పుడు రాష్ట్రంలో పాదయాత్ర చేయి చూద్దాం... జనాలు తరిమేత్తారు మిమ్మల్ని. అమ్మలారా.. అయ్యలారా మీ పెన్షన్ జగన్ నొక్కేశాడు. మీకు తెలియడం లేదు. రూ.3 వేలు పెంచుతానని చెప్పాడు. రూ.250 చొప్పున పెంచుకువచ్చాడు. ఇలా పెంచడం వల్ల మీకు జరిగిన నష్టం ఎంతో తెలుసా? ఒక్కొక్క పెన్షన్‌దారుడు రూ.27,500 నష్టపోయాడు. ఇలా చాలా ఉన్నాయి... ప్రజలారా మేల్కొండి. ఇలా నమ్మితే మొత్తం ఆస్తులన్నీ పోగొట్టుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రజలతోపాటు ఈ దుర్మార్గుడు ఉద్యోగులను మోసం చేశాడు. 60 లక్షల మంది ఉద్యోగులు ఇతని వల్ల మోసపోయారు. సీపీఎస్ రద్దన్నాడు. చేతులెత్తేశాడు. పోలీసులకు కూడా చెబుతున్నాం. తొత్తులుగా మారొద్దు. ఆలోచించుకోండి. చంద్రబాబు సీఎం అయితే రాష్ట్రం బాగుపడుతుంది. 140 బీసీ కులాలకు లబ్ధి చేకూరుతుంది అన్నారు.

చీరలొద్దు.. చేతనైతే విద్యుత్ చార్జీలు తగ్గించండి!

సబ్‌స్టేషన్‌లోకి వైసీపీ చీరలు విసిరిగొట్టి మహిళల ధర్నా

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 15: రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్‌కు చేతనైతే విద్యుత్ చార్జీలు తగ్గించాలేతప్ప చీరలు పంచడం కాదని మహిళలు ఎద్దేవా చేశారు. రాజమహేంద్రవరం 30వ డివిజన్‌కు చెందిన మహిళలు జాంపేట విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఎంపీ భరత్‌రామ్ ఇచ్చిన చీరలతో నిరసన ప్రదర్శన, ధర్నా చేశారు. ఈ ఆందోళనకు టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ మద్దతు ప్రకటించి మాట్లాడారు. ఉన్నట్టుండి ఎందుకు భరత్‌రామ్ మహిళలపై నీకు అంత అభిమానం పుట్టుకొచ్చిందని ప్రశ్నించారు. చీరలు సారెలు పెట్టి ఓట్లకు గేలం వేయాలని చూస్తున్నావుకానీ నీ చర్యను మహిళలంతా అసహ్యించుకుంటున్నారన్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని అప్పుడు ప్రజలందరికీ న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం మహిళలు ఎంపీ ఇచ్చిన చీరలను సబ్‌స్టేషన్‌లోకి విసిరికొట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, డివిజన్ అధ్యక్షుడు ఎరక కొండ, నాయకులు కిష్టాపర్, టిల్లు, తుత్తరపూడి రమణ, నరాల రమణమూర్తి, చాపల చిన్నరాజు, తెలుగు మహిళా నగర అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, రెల్లా సత్తిబాబు, ఈపి కిషోర్, తుళ్లి పద్మ పాల్గొన్నారు.



జాంపేట సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న మహిళలు.. మద్దతు తెలుపుతున్న ఆదిరెడ్డి వాసు

చంద్రబాబు ముందుకు రంప టికెట్ పంచాయితీ

నియోజకవర్గ పరిస్థితులను వివరించిన మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి, వంతల

చంద్రబాబు నివాసం వద్ద వంతలకు అనుకూలంగా ఆందోళన చేసిన ఆమె కేడర్



చంద్రబాబు నివాసం వద్ద రంపచోడవరం టీడీపీ శ్రేణులు ఆందోళన చేస్తున్న దృశ్యం

రంపచోడవరం, మార్చి15: రంపచోడవరం నియోజకవర్గ టీడీపీ టికెట్ మిరియాల శిరీషకు ఖరారు చేసిన అనంతరం ఆమెను వ్యతిరేకిస్తూ నియోజకవర్గ తాజా మాజీ ఇన్‌చార్జి వంతల రాజేశ్వరి, మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు, మహిళా నాయకురాలు గొర్లె సునీత, వారి అనుచరవర్గం శుక్రవారం చంద్రబాబును కలిసి పరిస్థితిని వివరించారు. గురువారం నుంచి రంపచోడవరంలో నియోజకవర్గ ఇన్‌చార్జి వంతల శిబిరంలో ఆమెకు మద్దతుగా నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. అలాగే శుక్రవారం ఉదయం పెద్దఎత్తున వాహనాల్లో నాయకులు ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి చేరుకున్నారు. చంద్రబాబు నివాసం ముందు నాయకులు, కార్యకర్తలు వంతలకు అనుకూలంగా నినాదాలు చేశారు. ఈలోగా తాము కలిసి పరిస్థితిని వివరించాలనుకుంటున్నామని శీతంశెట్టి, రాజేశ్వరిలు చంద్రబాబు వద్దకు కబురుపంపగా నలుగురికి అవకాశం ఇచ్చారు. బాబును కలిసిన శీతంశెట్టి, రాజేశ్వరి, గొర్లె సునీత, శివాజీలు రంప టికెట్‌ను మార్చాల్సి ఉన్నదని కోరారు. కాగా అన్ని సర్వేలు చేసి టికెట్‌ను ఖరారు చేశామని చంద్రబాబు వివరించగా, ఇప్పుడు టికెట్ మార్చకుంటే పార్టీ దెబ్బతింటుందని చెప్పగా పరిశీలిస్తామని బాబు హామీ ఇచ్చారని నలుగురు నాయకులు మీడియాకు చెప్పారు.



టీ దోమ ఆశించడంతో మాడిపోయిన జీడిమామిడి తోట

ఏమిటీ కష్టం!

- జీడిమామిడికి ఆశిస్తున్న టీ దోమ
- ముందే గుర్తించిన ఉద్యానశాఖాధికారులు
- మాడిపోతున్న పూత
- పిందె దశలో రాలిపోతున్న పిక్కలు
- అప్రమత్తమైన అధికారులు
- నివారణా చర్యలు చేపట్టకపోతే దిగుబడులపై ప్రభావం
- తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన
- ఆందోళన చెందుతున్న జీడిమామిడి రైతులు



టీ దోమ

పెద్దాపురం, మార్చి 15: జీడిమామిడి ఉద్యాన వాణిజ్య పంటల్లో ప్రధానమైనది. డ్రైఫ్రూట్ పంటల్లో అధికంగా తినబడే జీడిపప్పు పంట చేతికి రావాలంటే చాలా పురుగుల దాడులు తట్టుకోవాలి. ఇందులో జీడిమామిడికి కాండం, వేరు తొలిచే పురుగు తర్వాత అధిక నష్టం కలిగించేది తేయాకు దోమ (టి దోమ). ఇది నిజంగా దోమకాదు. కూర్చున్నప్పుడు దీని శరీర నిర్మాణం దోమ లాగ ఉండడం, తేయాకు తోటల్లో ఎక్కువగా కనిపించడం వల్ల దీన్ని తేయాకు దోమ అని పిలుస్తుంటారు.

జిల్లావ్యాప్తంగా 11,335 హెక్టార్లల్లో సాగు

జీడిమామిడి సాగు కాకినాడ జిల్లావ్యాప్తంగా 11,335 హెక్టార్లల్లో విస్తరించి ఉంది. జీడిమామిడి సాగులో టీ దోమ అక్టోబరు నుంచి ఏప్రిల్ నెలల్లో అక్కడక్కడా కనిపిస్తుంది. ఈ టీ దోమ పూతదశ నుంచి పంట చేతికందే వరకూ కనిపిస్తుంది. లేత ఆకులు, పూతలు మాడిపోతాయి. పక్వానికి రాని గింజలు ముందుగానే రాలిపోతాయి. గింజలపై మచ్చలు చారలు ఏర్పడి నాసిరకంగా తయారవుతయాయి. ఈ టీదోమ ప్రభావం కారణంగా చెట్టు పాలిపోయినట్టుగా కనిపిస్తుంది. ఈ దోమ చిరు దశలోను తల్లిదశలోనూ లేత కొమ్మలు పైన రెమ్మలు పైన వాలి వాటి రసాన్ని పీల్చడం వల్ల ఎర్రని జిగురులాంటి పదార్థం కారుతూ నల్లని చారలు ఏర్పడతాయి. ఇలా టీ దోమ తోటల్లో గుర్తించవచ్చని అధికారులు చెబుతున్నారు.

మూడు దశల్లో సస్యరక్షణ చర్యలు

టీ దోమ నివారణకు మూడు దశల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. మొదటిది చిగురాకు దశ, ఈ దశ అక్టోబరు నుంచి నవంబరు నెల్లో కనిపిస్తుంది. రెండవది పూత దశ ఇది డిసెంబరు నుంచి జనవరి నెలల్లో కనిపిస్తుంది. మూడోది గింజకట్టే దశ. ఇది ఫిబ్రవరి నుంచి మార్చి నెలల్లో కనిపిస్తుంది. ఈ మూడు దశల్లోనూ సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యాన శాఖాధికారులు సూచిస్తున్నారు.

నివారణ ఇలా...

జీడిమామిడి తోటల్లో పూతదశ ప్రారంభమయ్యింది. పూతదశలోనే తేయాకు దోమ (టీ దోమ)ను అధికారులు గుర్తించారు. ఈ దశలోనే దీనిని నియంత్రించాలని అందుకు అనుగుణంగా అధికారులు చర్యలు చేపట్టారు. టీ దోమ నివారణకు ఎల్..సైహాలోత్రిన్, ఎసిటామిప్రిడ్ థయామీ థాక్సమ్ మందులను తగు మోతాదులో పిచికారీ చేసుకోవాలి, లేదా ప్రొఫినోఫాస్ 1 మిల్లీలీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవచ్చని ఉద్యానశాఖాధికారులు చెబుతున్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

జీడిమామిడి తోటల్లో తేయాకు దోమ (టీ దోమ)ను గుర్తించడం జరిగింది.. దీనికి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ముందుగా గుర్తిస్తే నష్టాన్ని చాలావరకూ నివారించుకోవచ్చు. టీ దోమ జీవిత చక్రం 20 నుంచి 30 రోజుల్లో ఆగిపోతుంది. జీడిమామిడి చెట్టు చుట్టూ పళ్లాలు చేసి కలుపులేకుండా చూసుకోవాలి. ముఖ్యంగా జనవరి నెలలో దీని ఉధృతి అధికంగా ఉంటుంది. ఇప్పటికే అప్రమత్తమయ్యాం. దీనిని సమర్థవంతంగా ఎదుర్కొంటాం.

- నూనె సుజాత,
ఉద్యానశాఖాధికారిణి, పెద్దాపురం

చెందుర్తిలో మహిళ దారుణహత్య



హత్యకు గురైన కుమారి

గొల్లప్రోలురూరల్, మార్చి 15: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తిలో మహిళ దారుణహత్యకు గురైంది. సహజీవనం చేస్తున్న వ్యక్తే ఈ సంఘటనకు పాల్పడినట్టు చెబుతున్నారు. చెందుర్తి గ్రామానికి చెందిన అయినవిల్లి కుమారి (48) రెండు దశాబ్దాల కిందట భర్తతో విడిపోయింది. అప్పటి నుంచి అదే గ్రామానికి చెందిన తాటిపర్తి కనకలింగేశ్వరరావుతో సహజీవనం సాగిస్తోంది. కొంతకాలంగా కుమారి వేరే వ్యక్తితో సన్నిహితంగా ఉంటుందనే విషయంలో కనకలింగేశ్వరరావుతో ఘర్షణ జరుగుతోంది. గురువారం అర్ధరాత్రి ఇదే విషయంపై గొడవ జరిగింది. దీంతో మడత మంచం పట్టితో కుమారిని కొట్టి కనకలింగేశ్వరరావు హతమార్చాడు. ఈ సంఘటన స్థానికంగా సంచలనం కలిగించింది. పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్‌ఐ బాలాజీలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

యువతిని మోసగించిన కేసులో
నిందితుడికి పదకొండేళ్లు జైలు

కాట్రేనికోన, మార్చి 15: యువతిని మోసగించిన కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి న్యాయస్థానం 11 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. ఎస్‌ఐ ఎస్. నాగేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు గుత్తుల వెంకటకిరణ్ బంటుమిల్లికి చెందిన ఒక యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి వంచనకు పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు 2020 మే 27న అప్పటి ఎస్‌ఐ సంపత్‌కుమార్ కేసు నమోదుచేశారు. కోర్టులో వాదప్రతివాదాల అనంతరం నేరం రుజువుకావడంతో జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి వై.బెన్నయ్యనాయుడు ముద్దాయికి 11 సంవత్సరాలు జైలు, రూ. 5,000 జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ మారిశెట్టి వెంకటేశ్వరరావు వాదించారు.



బోల్తాపడిన ఆటో.. (పక్కన) గాయపడ్డ విద్యార్థులను తరలిస్తున్న దృశ్యం

ఆటో బోల్తా.. పలువురు విద్యార్థులకు గాయాలు

ఎటపాక, మార్చి 15: పాఠశాలకు విద్యార్థులతో వెళ్తున్న ఆటోకు వానరాలు అడ్డురావడంతో వాటిని తప్పించబోయి విద్యార్థుల ఆటో అదుపుతప్పి బోల్తాపడిన ఘటన శుక్రవారం గుండాల-రాయనపేట మధ్యలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. రాయనపేట, వెంకటరెడ్డిపేట గ్రామాలకు చెందిన కొందరు విద్యార్థులు భద్రాచలంలోని ఓ ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ క్రమంలో రోజు మాదిరిగానే విద్యార్థులు ఆటోలో పాఠశాలకు వెళ్తున్నారు. అయితే గుండాల- రాయనపేట మధ్యలో కల్వర్టు సమీపంలో వానరాలు ఒక్కసారిగా అడ్డురావడంతో తప్పించబోయి అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. గాయాలైన వారిని వేరే ఆటోలో చికిత్స కోసం భద్రాచలానికి తరలించి వైద్య చికిత్స అందించారు.



జాతీయ రహదారిపై వ్యాన్ ఢీకొనడంతో మృతి చెందిన రాంబాబు

గూడ్స్ వ్యాన్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

రాజానగరం, మార్చి 15: రాజానగరం జాతీయ రహదారిపై నరేంద్రపురం జంక్షన్ వద్ద శుక్రవారం సాయంత్రం గూడ్స్ వాహనం ఢీకొని ఒక వ్యక్తి దుర్మరణం చెందాడు. మృతుడు గొల్లప్రోలుకు చెందిన దూది రాంబాబు (42)గా పోలీసులు గుర్తించారు. రాంబాబు గొల్లప్రోలు నుంచి మోటార్‌సైకిల్‌పై కోరుకొండ మండలం దోసకాయలపల్లిలోని కుమార్తె ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో రాజానగరం-నరేంద్రపురం జంక్షన్‌లో రోడ్డు దాటుతుండగా రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న గూడ్స్ వాహనం మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టడంతో రాంబాబు తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాంబాబు హోటల్‌లో పనిచేస్తుంటాడు. ఈ మేరకు ఎస్‌ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

పీడీఎస్ బియ్యం లారీపై విజిలెన్స్ దాడులు

సామర్లకోట, మార్చి 15: కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణ శివారున కాకినాడకు భారీ లారీలో అక్రమంగా తరలివెళుతున్న పీడీఎస్ (రేషన్) బియ్యం రవాణాపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించి రూ.9 లక్షల 98 వేల 243 విలువైన 4,357 కిలోల రేషన్ బియ్యాన్ని 94 మూటలలో రవాణా చేస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ అధికారులకు ముందుగా అందిన సమాచారం మేరకు టీఎస్ 28 టీబీ 3127 నంబరు గల అశోక్‌లేలాండ్ లారీని ఆపి సోదాచేయగా పీడీఎస్ బియ్యం అక్రమంగా రవాణా అవుతున్నట్టు అధికారులు గుర్తించారు. తెలంగాణ రాష్ట్రంలోని కొత్తగూడెం మండలంలోని మెదరబస్తి గ్రామానికి చెందిన వాహన యజమాని ఏ.పవన్, డ్రైవర్లు చందు, పి.సాయిభరత్‌ల ద్వారా పాల్వంచ నుంచి కాకినాడకు లారీలో తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు సోదాలు చేయడంతో అక్రమ రవాణా బహిర్గతమయ్యింది. రేషన్ బియ్యంగా నిర్ధారించి సదరు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సామర్లకోట ఎంఎస్‌ఓ కీర్తికి విజిలెన్స్ అధికారులు స్వాధీనపర్చారు. 6ఏ కింద కేసు నమోదు చేసి వాహనాన్ని సామర్లకోట పోలీసులకు అప్పగించారు. లారీ యజమాని, ఇద్దరు డ్రైవర్లపైనా క్రిమినల్ చర్యల నిమిత్తం తదుపరి దర్యాప్తు చేస్తున్నట్టు విజిలెన్స్ అధికారులు నాగవెంకటరాజు, లక్ష్మీనారాయణ, సీఎస్ డీటీ కీర్తి, విజయకుమారి, జీవానందంలు తెలిపారు.


జిల్లా బీసీ సంక్షేమ సాధికారతాధికారిగా లల్లి

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 15: కాకినాడ జిల్లా బీసీ సంక్షేమ సాధికారతాధికారిగా ఎం.లల్లి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె జిల్లా కలెక్టర్ కృతికాశుక్లాను కలిశారు.

20న అయోధ్యకు సూపర్‌లగ్జరీ బస్సు

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 15: ఈనెల 20న కాకినాడ డిపో నుంచి అయోధ్యకు సూపర్‌లగ్జరీ బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ తెలిపారు. కాకినాడలో బయలుదేరి పూరి, కోణార్క్, భువనేశ్వర్, సాక్షిగోపాలం, జాజిపూర్, గయ, వారణాసి, ప్రయాగ్‌రాజ్, అయోధ్య, నైమిశారణ్యం, సీతామఢి క్షేత్రాలను చూపించి తిరిగి 30న కాకినాడ చేరుకుంటుందన్నారు. బస్సుకు టిక్కెట్ రూ.12,000 ధర నిర్ణయించారన్నారు. ఉదయం ఫలహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయం కల్పించామన్నారు. వివరాలకు 7382910869, 7382910778 నెంబర్లను సంప్రదించాలన్నారు.

రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ మృతి



కరప, మార్చి 15: ఉమ్మడి రాష్ట్రంలో వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన డాక్టర్ విప్పర్తి నాగరాజు బుధవారం సాయంత్రం కాకినాడ జిల్లా కరపలోని ఆయన స్వగృహంలో మృతిచెందారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు తోటలో డాక్టర్‌గా సుపరిచితులైన నాగరాజు వైద్యవృత్తిలో సుదీర్ఘకాలం పనిచేశారు. రంగంపేట, నగరం, సోంపేట, ఇందుకూరుపేట, దుగ్గుదూరు, అమలాపురం, కాకినాడ ఏపీఎస్పీ, పెదపూడి, తదితర పీహెచ్‌సీలలో వైద్యాధికారిగా పనిచేశారు. ఆ తరువాత ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వోగా, విశాఖపట్నం జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌వోగా, శ్రీకాకుళం జిల్లా వైద్యాధికారిగా పనిచేసిన ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వైద్యఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించి 2000లో పదవీవిరమణ చేశారు. రిటైర్ అయిన తరువాత కూడా నిర్విరామంగా పేదప్రజలకు వైద్యసేవలందించారు. ఆయన మరణవార్త విని పలువురు శోకసముద్రంలో మునిగిపోయారు. నాగరాజు కుమారుడు, ఎస్తేర్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ విప్పర్తి సుదర్శన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్తేర్ కాంపౌండ్‌లో శుక్రవారం ఆదరణ కూడిక నిర్వహించారు. ఈసందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి పలువురు విచ్చేసి నివాళులర్పించారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

అమలాపురం టౌన్, మార్చి 15: ఆర్టీసీ అమలాపురం డిపో పరిధిలో ప్రయాణికులకు అందిస్తున్న సేవలపై శనివారం 'డయల్ యువర్ డీఎం' నిర్వహిస్తున్నట్టు మేనేజరు చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. 16వ తేదీ ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా ప్రయాణికులు తమ సలహాలు, సూచనలను 9959225576 నెంబరుకు తెలియజేయాలన్నారు.

రంజాన్ మాస ప్రత్యేక ప్రార్థనలు

అమలాపురం టౌన్, మార్చి 15: పవిత్ర రంజాన్ మాసం శుక్రవారం పర్వదినాన అమలాపురం మొల్లా ముస్తఫా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇమామ్ మహ్మద్ రజా ఆధ్వర్యంలో నమాజు చేశారు. ఖాతిం ఇమామ్ హజరత్‌మౌలానా ఆధ్వర్యంలో ఖురాన్ పఠించారు. జానీబాషా ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం జరిపారు. ఇఫ్తార్ విందు స్వీకరించారు. మహ్మద్ అమీర్, ఎంఎంకేజీ మొయినుద్దీన్, మహ్మద్ బషీర్, నిజాం, ఎండీ ఆజామ్ పాల్గొన్నారు.

మసీదుల్లో మొదటి శుక్రవారం ప్రార్థనలు

మామిడికుదురు: పవిత్ర రంజాన్ మాసంలో మొదటి శుక్రవారం ముస్లింలు భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. మామిడికుదురులోని షియా, సున్నీ జామియా మసీదుల్లో ఈ ప్రార్థనలు జరిగాయి. మత ప్రబోధకులు సయ్యద్ అబ్బాస్‌బాకరి, షబ్బర్ అలీజైదీలు రంజాన్ మాసంలో శుక్రవారం విశిష్టతను భక్తులకు వివరించారు.

రాయవరంలో భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమం

రాయవరం, మార్చి 15: రాయవరం మండల ప్రజాపరిషత్ సమావేశపు హాల్‌లో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ పీవో ఎ.గజలక్ష్మి ఆధ్వ ర్యంలో జరిగిన కార్యక్రమంలో గైనకాలజిస్టు జి.ప్రత్యూష పాల్గొని బాల్య వివాహాలవల్ల కలిగే నష్టాలు నిర్మూలకు తీసుకోవాల్సిన చర్యలు లింగ వివక్ష మొదలైన అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆడపిల్లల్ని రక్షిద్దాం, ఆడపిల్లల్ని చదివిద్దాం స్టిక్కర్లను బాల్యవివాహాల నిషేధ చట్టం పోస్టర్లను ఆవిష్కరించారు. వివిధ రంగాల్లో ప్రతిభకనబర్చిన హెల్త్, ఐసీడీఎస్, పంచాయతీరాజ్ ఘనంగా సత్కరించారు.

చిలకలూరిపేట సభను విజయవంతం చేయాలి

అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి అయితాబత్తుల పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం రూరల్, మార్చి 15: చిలకలూరిపేట బొప్పూడిలో ఆదివారం జరిగే టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి సభను విజయవంతం చేయాలని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మండల శాఖ అధ్యక్షుడు మల్లుల పోలయ్య అధ్యక్షతన ప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పాల్గొనే ఎన్నికల శంఖారావ సభను విజయవంతం చేసేందుకు నాయకులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో రాజులపూడి భీముడు, బొర్రా ఈశ్వరరావు, మంద గెద్దయ్య, చొల్లంగి సత్యసాయిబాబా, మాడా మాధవి, యనమదల లక్ష్మి, పిచ్చిక శ్యామ్, మంథా ఫణికుమార్, కామన రాజు, కాట్రు కృష్ణ, ముత్తాబత్తుల రమణ, గోసంగి ఆనందరావు, బడుగు సత్యనారాయణ పాల్గొన్నారు.

అల్లవరం: చిలకలూరిపేట సభను విజయవంతం చేయాలని టీడీపీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు కోరారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు అధ్యక్షతన అల్లవరంలోని పార్టీ కార్యాలయం వద్ద ఆయన ఉమ్మడి పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. నడింపల్లి సుబ్బరాజు, వేగిరాజు వెంకట్రాజు, దాట్ల గోపిరాజు, పోలిశెట్టి బాబులు, సుంకర సాయిబాబు, పంపిరెడ్డి కాశీ, వేగిరాజు శ్రీనురాజు, కంకిపాటి గోపి, కొల్లి విష్ణుమూర్తి, బండిగుప్లాపు సత్తిబాబు, కేవీ, పోతుల నాగరాజు, నార్గన శ్రీను, ఉండ్రు భగవాన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: ఈ నెల 17న చిలకలూరిపేటలో జరిగే టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి బహిరంగ సభను జయప్రదం చేయాలని రాజోలు నియోజకవర్గ పరిశీలకుడు చిటికెన రామ్మోహనరావు అన్నారు. లక్కవరంలో జిల్లా ఉపాధ్యక్షుడు ముదునూరి చినబాబురాజు ఇంటివద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు ముప్పర్తి నాని, అడబాల యుగంధర్, గుబ్బల శ్రీనివాస్, మొల్లేటి శ్రీనివాస్, మంగెన భూదేవి, బందెల పద్మ, చెల్లుబోయిన హెలీన, మోకా పార్వతి, జాంబవతి, రాపాక నవరత్నం పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: ప్రధాని మోదీ పాల్గొనే టీడీపీ, జనసేన, బీజేపీ ప్రజాగళం సభను విజయవంతం చేయాలని టీడీపీ అమలాపురం అసెంబ్లీ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం గొల్లవిల్లిలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అరిగెల నానాజీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ నిమ్మకాయల సూర్యనారాయణమూర్తి, గొలకోటి చిన్నా, చిక్కం పెద్దబ్బులు, అడబాల సత్యనారాయణ, చీకట్ల ఏసు, రవణం మధు, బూసి బుజ్జిదొర, సలాది శ్రీనివాసరావు, చిక్కం కాసు, మల్లాడి వెంకటరమణ, మంచెం బుజ్జి, పెమ్మిరెడ్డి సత్యనారాయణ, ఆకుల వెంకటరమణ, చప్పిడి వెంకటేశ్వరరావు, సూర్యప్రకాశం పాల్గొన్నారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): ఆదివారం జరుగనున్న టీడీపీ, జనసేన, బీజేపీ ప్రజాగళం సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు యాండ్ర బుల్లి అబ్బులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇళ్ల వెంకటేశ్వరరావు, ఎస్సీ మోర్చా ఉత్తరాంధ్ర జోన్ ఇన్‌చార్జి రాజులు కోరారు.

ఏపీపీఎస్సీ కుంభకోణానికి నైతిక బాధ్యత వహించి సీఎం జగన్ రాజీనామా చేయాలి

అమలాపురం టౌన్, మార్చి 15: ఏపీపీఎస్సీలో జరిగిన కుంభకోణానికి జగన్ నైతిక బాధ్యత వహించి సీఎం పదవికి తక్షణం రాజీనామా చేయాలని టీడీపీ అమలాపురం లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్ డిమాండు చేశారు. యువత భవిష్యత్తుతో ఆటలాడుకోవడం సరికాదన్నారు. త్వరలో రాష్ట్రంలో అధికారంలోకి రానున్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి యువతను అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు. గ్రూప్-1 ఉద్యోగాలను కోట్లకు అమ్ముకుని రాష్ట్రం పరువును గంగలో కలిపారని విమర్శించారు. హైకోర్టు తీర్పుతో రాష్ట్ర ప్రభుత్వం అవినీతి మరోసారి బట్టబయలైందన్నారు.

ఏప్రిల్ 7న జాతీయ శతాధిక కవి సమ్మేళనం

అమలాపురంటౌన్, మార్చి 15: అమలాపురంలో జాతీయ శతాధిక ఉగాది కవి సమ్మేళనాన్ని ఏప్రిల్ 7న నిర్వహించనున్నట్టు శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్ తెలిపారు. లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో కవి సమ్మేళనం, కోనసీమ కవితోత్సవం జరుగుతాయన్నారు. లయన్స్ క్లబ్ హాలులో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో గౌరవ డాక్టరేట్లు అందుకున్న శ్రీశ్రీ కళావేదిక జిల్లా శాఖ అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, కార్యదర్శి బీవీవీ సత్యనారాయణలను సత్కరించారు. బుర్ర కథ కళాకారుడు కడలి సత్యనారాయణ, దాసరి శ్రీనివాససూర్య, మాకే బాలార్జున సత్యనారాయణ, కె.నరసింహం పాల్గొన్నారు.

శాశ్వత విద్యానిధికి దాతల విరాళం

అమలాపురంటౌన్, మార్చి 15: ది కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం శాశ్వత విద్యానిధికి దాతలు రూ.85,116 విరాళాన్ని సంఘ అధ్యక్షుడు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి శుక్రవారం అందజేశారు. గ్రామ సంఘ అధ్యక్షుడు బళ్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బండారులంక చినచంద్రపురంలో పర్యటించగా ఆశపు రాజశేఖర్ రూ.30,116, బళ్ల సుబ్రహ్మణ్యం, బళ్ల చినపుల్లయ్యలు రూ.10వేలు చొప్పున అల్లాడ సాంబశివరావు, కారుపర్తి మల్లేశ్వరరావు, మావూరి భాస్కరరావు, బళ్ల తాతారావు, ఉప్పుగంటి భాస్కరరావు, బళ్ల మల్లేశ్వరరావు రూ.5వేలు చొప్పున విరాళాలను అందజేశారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రాలేదని మనస్థాపంతో భర్త మృతి

ఆత్రేయపురం, మార్చి 15: భార్య కాపురానికి రాలేదని మనస్థాపంతో భర్త పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన మేడిద రమేష్ (36) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన అతడు భార్యతో తరచూ గొడవపడుతున్నాడు. దీంతో ఆమె 15 రోజుల క్రితం తన పుట్టినిల్లయిన వాడపల్లి వెళ్లిపోయింది. భార్యను కాపురానికి రమ్మని పెద్దల ద్వారా కబురు పంపినా రాకపోవడంతో ఈనెల 11న ర్యాలిలో తన ఇంటి సమీపంలోని పశువుల పాక వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తొలుత రావులపాలెంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి కాకినాడ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారంరాత్రి మృతి చెందాడు. మృతుడి సోదరుడు వెంకట్రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు.



రాయవరం: ఎమ్మెల్యే వేగుళ్ల సమక్షంలో టీడీపీలో చేరిన మాచవరం గ్రామస్థులు



హరీష్ సమక్షంలో టీడీపీలో చేరిన మాజీ ఎంపీపీ పద్మప్రియ దంపతులు



రావులపాలెంలో బీజేపీ శ్రేణులతో మాట్లాడుతున్న బండారు సత్యానందరావు

రానున్నది ఉమ్మడి ప్రభుత్వమే: ఎమ్మెల్యే వేగుళ్ల

రాయవరం, మార్చి 15: ఏపీలో త్వరలో జరిగే ఎన్నికల్లో విజయం సాధించేంది టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వమేనని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని మాచవరం గ్రామంలో బూత్ ఇన్‌చార్జ్‌లు, కుటుంబ సాధికార సారధులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. తొలుతగా ఇటీవల మరణించిన నీటి సంఘం మాజీ ఉపాధ్యక్షుడు మల్లిడి ఆదినారాయణరెడ్డి మృతికి సంతాపం తెలిపారు. ఈకార్యక్రమంలో కర్రి వెంకట రామకృష్ణారెడ్డి, వీరెళ్ల కృష్ణమూర్తి, సబ్బెళ్ల వెంకన్నబాబు, మేడపాటి రవీంద్రారెడ్డి, కొవ్వూరి ఆదిరెడ్డి, రిమ్మలపూడి సత్యనారాయణ, కోడి చినప్ప అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

పలువురు టీడీపీలో చేరిక: మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన సబ్బెళ్ల చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ రొంగల శ్రీను, నల్లమిల్లి మణికంఠరెడ్డి, మల్లిడి గణపతిరెడ్డి, రాళ్ల నాగబాబు, భామిశెట్టి వీరబాబు, వెంకటేష్, కట్టా రామన్న, తేలు ఏసు, గుత్తుల సీతయ్య, గెద్దాడ భూ లోకం, వల్లి వీరబాబు, పంపన సుబ్బారావు, కట్టా వీరవెంకట సత్యనారాయణ, జి.గణేష్, సీహెచ్ దుర్గా ప్రసాద్, సువర్ణరాజులు టీడీపీలో చేరగా వారికి ఎమ్మెల్యే వేగుళ్ల పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

మండపేట: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన పలువురు యువకులు వార్డుకు చెందిన యలమంచిలి శ్రీను ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వేగుళ్ల సమక్షంలో శుక్రవారం టీడీపీలో చేరారు. పార్టీలో చేరినవారిలో ఉట్లరవి, మీసాల చిన్న, ఇసుకపల్లి కళాప్రతాప్, కాల ఉదయ్, బొత్స నరసింహ, జంధ్యం రాజు, ప్రదీప్‌తోపాటు పలువురు పార్టీలో చేరినవారిలో ఉన్నారు. పార్టీలో చేరిన వారిని ఎమ్మెల్యే వేగుళ్ల కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, వాద్రాప్రసాదరావు, జోన్నపల్లి సూర్యారావు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు ఉన్నారు.

టీడీపీలో చేరిన మాజీ ఎంపీపీ పద్మప్రియ దంపతులు

అమలాపురం టౌన్: అల్లవరం మాజీ ఎంపీపీ చిప్పల యామినీ పద్మప్రియ-నరేష్‌కుమార్ దంపతులు శుక్రవారం అమలాపురంలోని టీడీపీ లోక్‌సభ కార్యాలయం వద్ద ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్ సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో జల్లా సత్యశ్రీ, పలచోళ్ల వెంకటేశ్వరరావు, కోలా నరసింహస్వామి, కొప్పాడి వినాయక, దాసరి ఉమ, కొక్కిరిగడ్డ జయంతిబాబు, పట్నాల రమణ తదితరులు ఉన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో మేలు

కొత్తపేట: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో ప్రతి కుటుంబానికీ మేలు జరుగుతుందని కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవార ఆయన మోడేకుర్రు శివారు రాకూర్తివారిపాలెంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి ఆయనకు ఘన స్వాగతం పలికారు. బండారు ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామాల్లో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

బీజేపీ నేతలతో బండారు భేటీ

రావులపాలెం: సార్వత్రిక ఎన్నికల్లో తనను గెలిపించాలని ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు కోరారు. బీజేపీ పదాధికారి, గుంటూరు జిల్లా ఇన్‌చార్జి తమలంపూడి రామకృష్ణారెడ్డిని శుక్రవారం ఆయన స్వగృహంలో బండారు కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు పార్టీల కూటమి ఏర్పడడంతో రాష్ట్రంలోను, కొత్తపేటలోను ఉమ్మడి అభ్యర్థులు గెలవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నడింపల్లి సుబ్బరాజు, చిలువూరి సతీష్‌రాజు, గుత్తుల పట్టాభిరామారావు, కొత్తపేట, ఆత్రేయపురం, రావులపాలెం ఆలమూరు మండలాలకు చెందిన బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రాజోలులో పరిచయం లేని వ్యక్తికి టికెట్ ఇస్తారా!

రాజోలు, మార్చి 15: రాజోలు నియోజకవర్గంలో ప్రజలతో ఎటువంటి సంబంధం లేని వ్యక్తికి జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా ఎమ్మెల్యే టికెట్ ఇస్తే పరాజయం అవుతుందని రాజోలు మండలం జనసేనపార్టీ అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీను అన్నారు. రాజోలులో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం నుంచి ఎటువంటి అధికారిక పత్రం అందుకోకుండానే దేవవరప్రసాద్ తానే ఎమ్మెల్యే అభ్యర్థినని తిరగడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మామిడికుదురు, మలికిపురం మండలాల అధ్యక్షులు జాలెం శ్రీనివాసరాజ, మల్లిపూడి సత్తిబాబు, ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి, వైస్ ఎంపీపీ ఇంటిపల్లి ఆనందరాజు, బోనం సాయి, కోళ్ల బాబి, సూదా మోహన్ పాల్గొన్నారు.

పరమాత్ముని దర్శించడమే ఆధ్యాత్మిక మార్గం



అనుగ్రహ భాషణం చేస్తున్న పరిపూర్ణానందగిరి

అమలాపురంరూరల్, మార్చి 15: సమస్త జీవరాశిలోనూ పరమాత్ముడిని చూసే ప్రయత్నమే ఆధ్యాత్మిక మార్గమని ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి పేర్కొన్నారు. శుక్రవారం నల్లమిల్లి శ్రీసద్గురు గీతాశ్రమ ప్రాంగణంలోని శ్రీమురళీ కృష్ణ మందిరం వద్ద జరిగిన కార్యక్రమంలో భక్తులకు ఆయన అనుగ్రహభాషణ చేశారు. ఏ జీవికీ అపకారం జరగకుండా చేతనైనంత ఉపకారం జరిగేలా జీవించడమే జీవిత పరమార్థమన్నారు.యజ్ఞ యాగాది క్రతువులు నిర్వహిస్తూ దానధర్మాలు, మంత్రజపం, తపస్సు, సేవ చేయడం వల్ల జ్ఞాన వైరాగ్యాలు కలుగుతాయని శ్రీకృష్ణపరమాత్ముడు స్పష్టంగా చెప్పారన్నారు. భక్తులు స్వామివారికి పాదపూజచేసి తులాభారం నిర్వహించారు. మాతా బ్రహ్మనందగిరి, మాతా ప్రవానందగిరి, మాతా పరబ్రహ్మనందగిరి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉమెన్ ఐకాన్ అవార్డు గ్రహీత జ్యోతికి సన్మానం

అల్లవరం, మార్చి15: సేవారంగంలో ఉమెన్ ఐకాన్ జాతీయ అవార్డు పొందిన కొమరగిరిపట్నానికి చెందిన కట్టా జ్యోతిని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌సత్కరించారు. జ్యోతిభర్త తరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్పీఐ రాష్ట్ర అధ్యక్షుడిగా లోక్



డీబీ లోక్

అమలాపురంటౌన్, మార్చి 15: అమలాపురం పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది దోనిపాటి భూలోక్‌ను రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (కోబ్రగడ్)రాష్ట్ర అధ్యక్షుడిగా నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు సునీల్‌రామ్ టేక్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఈయన ఆర్పీఐ జాతీయ కార్యదర్శిగా వున్నారు. రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో కీలక భూమిక వహించేలా చర్యలుతీసుకుంటానని లోక్ చెప్పారు.

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

ఉప్పలగుప్తం, మార్చి 15: ఉప్పలగుప్తం పంచాయతీలో ఎస్ఎండీఎఫ్ నిధులు రూ.88లక్షలతో రహదారి నిర్మాణానికి మంత్రి పినిపే విశ్వరూప్ శుక్రవారం కామరాజుపేట వద్ద శంకుస్థాపన చేశారు. 1.8 కి.మీ. మేర రహదారి నిర్మాణం జరుగుతుందని ప్రాజెక్టు డీఈఈ అన్యం రాంబాబు తెలిపారు. సర్పంచ్ కడిమి చిన్నవరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జడ్పీటీసీ గెడ్డం సంపదరావు, ఉప సర్పంచ్ మోకా శ్రీనివాసరావు, నాయకులు మోటూరి సత్యంకాపు, ఆకుల రామకృష్ణ, అడబాల మాధవ, చీకట్ల కిశోర్ పాల్గొన్నారు.

గొడవర్తి సేవలు చిరస్మరణీయం



ఆలమూరు, మార్చి 15: టీడీపీ సీనియర్ నేత గొడవర్తి సత్యానందం దశమ వర్ధంతిని ఆలమూరులో ఆ పార్టీ మండల నేతల సమక్షంలో శుక్రవారం నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహంవద్ద ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్యానందం కుమారుడు వెంకటనారాయణ అధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు, పేదలు 40మంది రైస్ కుక్కర్లు పంపిణీ చేశారు.

భీమేశ్వరాలయంలో టీడీపీ అభ్యర్థి సుభాష్ పూజలు



భీమేశ్వరాలయంలో పూజలు చేస్తున్న సుభాష్

ద్రాక్షారామ, మార్చి15: రామచంద్రపురం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని సందర్శించారు. భీమేశ్వర స్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.సుభాష్ విలేకరులతో మాట్లాడుతూ తనకు టికెట్ ప్రకటించిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, టీడీపీ యువనేత లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తాను శివభక్తుడినని పార్టీ టికెట్ ప్రకటించిన అనంతరం భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్నానని అన్నారు.

ద్రాక్షారామలో ఎన్నికల ప్రచారం ప్రారంభం

అనంతరం ఆలయసమీపంలో వైశ్య సామాజికవర్గానికి చెందిన పసుమర్తి కుటుంబీకులను కలసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఆయన వెంట పలువురు అభిమానులు పాల్గొన్నారు.

గెలుపునకు సహకరించండి

టీడీపీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం రామచంద్రపురం పట్టణంలో పలువురు ప్రముఖులను కలసి మద్దతు కోరారు. మాజీ మున్సిపల్ చైర్మన్ ఎస్ఆర్‌కె రాజగోపాలనరసరాజు(గోపాల్‌బాబు)ను కలసి తన విజయానికి సహకరించాలని కోరారు. అనంతరం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్‌ను జనసేన కార్యాలయంలో కలిశారు. జనసేన నాయకులు వడ్డి సత్యనారాయణ, గొల్లపల్లి కృష్ణ, అంకం శ్రీను, పోతాబత్తుల విజయకుమార్ తదితరులను కలసి మద్దతు కోరారు.

కేంద్ర బలగాల కవాతు

కొత్తపేట, మార్చి 15: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని గంటి, మందపల్లి, ఏనుగులమహల్, పల్లిపాలెం గ్రామాల్లో శుక్రవారం రావులపాలెం రూరల్ సీఐ రామ్‌కుమార్, ఎస్ఐ ఎం.అశోక్ ఆధ్వర్యంలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది కవాతు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలని సూచించారు.

ముమ్మిడివరం: ఎన్నికలు సక్రమంగా సజావుగా నిర్వహించే చర్యల్లో భాగంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ముమ్మిడివరం మండలంలో పోలీసులు సీఐఎస్ఎఫ్‌కు చెందిన 70 మంది జవాన్లతో కవాతు నిర్వహించారు. సీఐ ఎన్.కొండయ్య, ఎస్ఐ జి.సురేష్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బలగాలు ఈ కవాతు నిర్వహించారు.

కపిలేశ్వరపురం : మండలంలోని మాచర, మాచరమట్ల, చినకోరుమిల్లి, పెదకోరుమిల్లి గ్రామాల్లో శుక్రవారం కేంద్ర బలగాలతో పోలీస్ సిబ్బంది కవాతు నిర్వహించారు. అంగర పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మండపేట సీఐ శ్రీధర్, అంగర ఎస్ఐ పరదేశిలు తమ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రం ప్రారంభం

ద్రాక్షారామ, మార్చి 15: రామచంద్రపురం మండలం తాళ్లపొలంలో నూతనంగా నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని శుక్రవారం రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ ప్రారంభించారు. ఎంపీపీ అంబటి భవానీ, ఏఎంసీ చైర్మన్ పండు గోవిందరాజు, సర్పంచ్ కట్టా గోవిందు, ఉపసర్పంచ్ వల్లు శివ, ఎంపీటీసీ పంపన ఏడుకొండలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అద్దంపల్లిలో సచివాలయ భవనం ప్రారంభం

కె.గంగవరం, మార్చి15: మండలంలోని అద్దంపల్లిలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన గ్రామంలో పలువురు ప్రముఖులను కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పండు గోవిందరాజు, ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు, సర్పంచ్ చింతపల్లి లక్ష్మి వెంకటరమణ, ఎంపీటీసీ కోట బులిసత్యనారాయణ, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బహుజన భేరికి తరలివెళ్లిన బీఎస్పీ శ్రేణులు

పి.గన్నవరం, మార్చి 15: విజయవాడలో శుక్రవారం జరిగిన బహుజన భేరికి నియోజకవర్గ బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా పి.గన్నవరం మూడు రోడ్ల కూడలిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాష్ట్ర బీఎస్పీ ఈసీ మెంబరు బత్తుల లక్ష్మణరావు అంబేడ్కర్ విగ్రహానికి, కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అదే విధంగా నియోజకవర్గ ఇంచార్జ్ కుసుమ వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో కాన్షీరామ్ జయంతిని నిర్వహించారు. అనంతరం బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు విజయవాడకు తరలివెళ్లారు. కార్యక్రమంలో రాజోలు, ముమ్మిడివరం ఎమ్మెల్యే అభ్యర్థులు పులపకూర ఆశారాణి, వాకపల్లి భీమారావు, నియోజకవర్గ అధ్యక్షుడు తాడి రాంబాబు, ప్రధాన కార్యదర్శి ములపర్తి చంద్రరావు, లెనిన్, బాలు, గణేష్, తాడి రమేష్, పాల్గొన్నారు.

అభ్యర్థి ఎవరైనా విజయం సాధిస్తాం: గుండుబోగుల

మలికిపురం, మార్చి 15: రాజోలు నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థిగా పవన్ కల్యాణ్ ఎవరిని నియమించినా కేడర్ అంతా అతని వెనుకే పనిచేస్తామని జనసేన సమన్వయకర్త గుండుబోగుల పెద్దకాపు అన్నారు. మలికిపురంలో విలేఖరుల సమావేశం ఏర్పాటుచేసి గురువారం మంగళగిరిలో జరిగిన సంఘటన పట్ల విచారణం వ్యక్తం చేశారు. అధిష్ఠాన నిర్ణయమే తమ నిర్ణయమన్నారు. శుక్రవారం జరిగిన సమావేశంలో దిరిశాల బాలాజీ, పొన్నాల ప్రభ, శెట్టెం శ్రీనివాస్, గుండాబత్తుల తాతాజీ పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్సీ

కపిలేశ్వరపురం, మార్చి 15: మండలంలోని తాతపూడిలో శుక్రవారం పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయం భవనాన్ని, ఆర్‌బీకెను, వెల్‌నెస్ సెంటర్‌ను, మండలపరిషత్, జీపీ ఫండ్స్‌తో నిర్మించిన కాలిబాట వంతెనను, జీజీఎంపీ ఫండ్స్‌తో 2 సీసీ రోడ్లను ఎమ్మెల్సీ తోట ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీటీసీ జుత్తుగ వెంకటలక్ష్మి, గ్రామవైసీపీ అధ్యక్షుడు గూటం సత్యనారాయణ, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కేశవరంలో ఇళ్లపట్టాలు పంపిణీ

మండపేట, మార్చి15: మండపేట నియోజకవర్గంను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత తమ ప్రభుత్వందేనని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండపేట నియోజకవర్గంలో రూ.1800కోట్ల సంక్షేమం, రూ.500 కోట్లమేర అభివృద్ధి పనులు చేశామన్నారు. మండపేట మండలం కేశవరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం గ్రామ సర్పంచ్ పెదపాటి సత్యన్నారాయణ అధ్యక్షతన జరిగిన సభలో తోట ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఐదేళ్ల తర్వాత తమ సొంతింటి కళను నిజం చేసిన ఎమ్మెల్సీతోటను లబ్దిదారులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉండ మట్ల వాసు, ఏఎంసీ చైర్మన్ చిక్కాలశ్రీను, దూలం వెంకన్నబాబు, కూరుపూడి రాంబాబు, సర్పంచ్‌లు ఎంపీటీసీలు, లబ్ధిదారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మూడో రోజుకు విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

ఆలమూరు, మార్చి 15: మండలంలోని పెదపళ్లలో రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో నూతన శిలా విగ్రహ ప్రతిష్ఠామహోత్సవాలు శుక్రవారం మూడోరోజుకు చేరుకున్నా యి. వేద పండితుడు వాడపల్లి గోపాలాచార్యులు పర్యవేక్షణలో పలువురు వేద పండితులు ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, విశేష అర్చనలు నిర్వహించి భక్తులు వీక్షించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆసరా, చేయూత చెక్కుల పంపిణీ

రాయవరం, మార్చి 15: మండలంలోని వెదురుపాకలో శుక్రవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆసరా, చేయూత చెక్కులు పంపిణీ చేశారు. జడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నవుడు వెంకటరమణ, సర్పంచ్ మల్లిడి పెద్దబ్బాయి పాల్గొన్నారు.

అగ్నిస్తోమయాగం చేయడం ఎంతో పుణ్యఫలం

అంబాజీపేట, మార్చి 15: అగ్నిస్తోమయాగం చేయడం ఎంతో పుణ్యఫలమని తిరుపతికి చెందిన శ్రీవెంకటేశ్వరవేదిక్ యూనివర్శిటీ అధ్యాపకులు, వేదిక్ డీన్ దువ్వూరి ఫణి యజ్ఞేశ్వరయాజులు, రాజమహేంద్రవరం దత్తాత్రేయ గురుకుల పాఠశాల వ్యవస్థాపకులు గుళ్ళపల్లి సీతారామచంద్ర ఘనాపాఠిలు అన్నారు. అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరంలోని శ్రీ వ్యాఘ్రేశ్వరస్వామి ఆలయం వద్ద అగ్నిస్తోమ యాగం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితులు ఆకెళ్ళ సూర్యనారాయణ అవధాని, ఆకెళ్ళ వ్యాఘ్రేశ్వర వెంకటరామసూర్యసుబ్రహ్మణ్య నరసింహ హవిర్యాజిశర్మ- సీతానాగలక్ష్మి పాల్గొన్నారు.

అసిస్టెంట్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ

యానాం, మార్చి 15: పుదుచ్చేరి, కారైకాల్, మహే, యానాం ప్రాంతాలలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 256 అసిస్టెంట్ పోస్టు(గ్రూప్-బి నాన్ గెజిటెడ్) పోస్టుల భర్తీకి పుదుచ్చేరి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అర్హులైన అభ్యర్థులు ఈనెల 25వ తేదీ నుంచి పుదుచ్చేరి రిక్రూట్‌మెంట్ వెబ్‌సైటు నుంచి దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు పుదుచ్చేరి రిక్రూట్‌మెంట్ వెబ్‌సైటు నుంచి పొందవచ్చన్నారు.

లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్సులో కామేశ్వర్

అమలాపురం టౌన్, మార్చి 15: ఒక పైసా నుంచి 2 రూపాయలు ముఖ విలువల గల స్టాంపులను అత్యధికంగా సేకరించిన అమలాపురం భూపయ్య అగ్రహారానికి చెందినపుత్సా కృష్ణకామేశ్వర్ లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు దక్కించుకున్నారు. గతంలో 77తపాలా బిళ్లలతో ఉన్న రికార్డును కామేశ్వర్ 216 తపాలా బిళ్లల సేకరణ ద్వారా అధిగమించారు. కామేశ్వర్‌ను సంస్కార భారతి జిల్లా అధ్యక్షుడు ఆకొండి పవన్‌కుమార్, వేదనభట్ల సాయిలక్ష్మి, కళా పూర్ణారావు, పేరి లక్ష్మీనరసింహం, వాకర్స్ హెల్త్ క్లబ్ ప్రతినిధులు అభినందించారు.

మూలవాసుల మాసోత్సవం

ముమ్మిడివరం, మార్చి 15: అంబేడ్కర్ భావజాలాలను యువత గ్రామస్థాయిలో విస్తరింపచేసేందుకు కృషి చేయాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సబ్బతి ఫణీశ్వరరావు, విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు పిలుపునిచ్చారు. శుక్రవారం ముమ్మిడివరంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ భవనంలో విశ్వజన కళామండలి రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో మూలవాసుల మాసోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 15 కాన్షీరామ్ జయంతి నుంచి ఏప్రిల్ 14 డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వరకు నెలరోజులు మూలవాసుల మాసోత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా విశ్వజన కళామండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు యడ్ల సురేష్‌కుమార్, డీవైవీ సత్యనారాయణ, రేవు శ్రీను, గొల్లపల్లి గోపి, దాసరి సత్యనారాయణ, మూర్తి, కాశి వాసు పాల్గొన్నారు.

క్షేత్ర పాలకుడి ఆలయ పునర్నిర్మాణం

అంతర్వేది, మార్చి 15: అంతర్వేదిలో ఉన్న క్షేత్ర పాలకుడు పార్వతీ నీలకంఠేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శుక్రవారం రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు భూమిపూజ చేశారు. తొలుత అర్చకులు ప్రత్యేక పూజలు కార్యక్రమాల అనంతరం భూమి పూజ చేశారు. లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థాన దత్తత ఆలయమైన నీలకంఠేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి దేవదాయశాఖ, జీజీఎఫ్ నిధుల నుంచి రూ.కోటి 25 లక్షలు మంజూరయ్యాయని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకస్వాములు ఏఎస్వీసీహెచ్ సూర్యకుమార్, వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితుడు చింతా వెంకటశాస్త్రి, ఎంపీపీ వీరా మల్లిబాబు పాల్గొన్నారు.

ఆలిండియా బ్యాడ్మింటన్‌లో పుదుచ్చేరికి తృతీయస్థానం

యానాం, మార్చి 15: పట్నాలో జరిగిన 68వ జూనియర్ నేషనల్స్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో పుదుచ్చేరి జట్టు తృతీయస్థానం సాధించింది. యానాం బాల్‌బ్యాడ్మింటన్ కోచ్ బొట్టా శ్రీనివాస్ నేతృత్వంలో పాల్గొన్న జట్టు బాలుర డబుల్స్‌లో తృతీయ స్థానం సాధించిందని యానాం క్లబ్ కార్యదర్శి కాపగంటి శేష సుమాన్ తెలిపారు. పుదుచ్చేరి తరుపున డబుల్స్‌లో పాల్గొన్న ఎడ్ల రవికుమార్, రాజు, కదిరేషన్‌లు మంచి ప్రతిభ కనబరిచారన్నారు. వీరిని ఫెడరేషన్ సభ్యులు, కార్యదర్శి వై.రాజారావు, అధ్యక్షుడు కిషోర్‌యాదవ్ కాంస్య పతకాలతో సత్కరించారు.

పోలీసులకు పదోన్నతి

యానాం, మార్చి 15: యానాం పోలీసుశాఖ పరిధిలో పోలీసు, ఐఆర్‌బీఎన్ విభాగాలలో పలువురు హెడ్ కానిస్టేబుల్స్ నుంచి ఏఎస్ఐలుగాను, పలువురు ఎస్ఐలుగా పదోన్నతి పొందిన విషయం తెలిసిందే. పుదుచ్చేరి నుంచి యానాం వచ్చిన ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావును పలువురు కలిసి సత్కరించారు.

కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి

మామిడికుదురు, మార్చి 15: భారత ఆర్థిక వ్యవస్థలో ముఖ్యమైన వ్యక్తిగా గుర్తింపు పొందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటోను భారతదేశంలోని కరెన్సీ నోట్లపై ముద్రించాలని ఆలిండియా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సెక్రటరీ మురళి కోరారు. కార్యక్రమంలో దళిత నాయకులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: మాయ
వెంకటరమణ	: వెయ్ దరువెయ్
శ్రీలలిత	: గామి
శేఖర్ స్ర్కీన్-1	: తంత్ర
శేఖర్ స్ర్కీన్-2	: హనుమాన్
రమా	: ప్రేమలు
గణపతి	: గుంటూరు కారం
వెంకటపద్మావతిస్ర్కీన్-1	: భీమ
వెంకటపద్మావతి స్ర్కీన్-2	: భీమ